
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 104 వ భాగం

## భగవత్స్వరూపం

క్రితం వ్యాసం వరకూ భగవంతుడి విభూతి, స్వరూపం అన్నీ చెప్పాడు బ్రహ్మ నారదుడితో; ఏదో కొంతమంది భక్తులకే కాక ఎవరికైనా సరే భక్తి ఒకటే చాలు మాయ అనేది దాటడానికి అంటూ. సరే బాగానే ఉంది, ఇప్పుడా భక్తి ఒకసారి కుదురుకున్నాక మరోసారి ప్రాపంచిక విషయాలు వెనక్కి లాగవచ్చు. అధోగతిలోకి పోవచ్చు. అప్పుడెలా? దానికి సమాధానం కూడా చెప్తున్నాడు.

చ. హరిఁ బరమాత్ము నచ్యుతు ననంతునిఁ జిత్తములం దలంచి సు
స్థిరత విశోక సౌఖ్యములఁ జెందిన ధీనిధు లన్యకృత్యము
ల్మఱచియుఁ జేయనొల్లరు ;తలంచిన నట్టిదయౌ; సురేంద్రుఁడుం
బరువడి నుయ్యి; ద్రవ్వనె పిపాసితుఁడై సలిలాభిలాషితన్? [2-209]

భగవంతుణ్ణి మనసులో నిరంతరం ఉంచుకున్న వారి మనసు ఏమరుపాటున కూడా (మరచి చేయనొల్లరు) మిగతా విషయాలమీదకి పోనేపోదు. ఎలాగంటే, ప్రపంచంలో వర్షాలు కురిపించే ఇంద్రుడు దాహం తీర్చుకోవడం కోసం (పిపాసితుడై) నీటి కోసం (సలిలాభిలాషితన్) నుయ్యి తవ్వుతాడా? ఇదే విషయం రామకృష్ణ పరమహంస చెప్తూ ఉంటారు చాలాసార్లు. ఓ సారి భగవంతుడి మీదకి దృష్టి మరలగానే, మూలాధారం నుంచి ఒక్కో చక్రం దాటుకుంటూ వెళ్ళేసరికి ఇంక భగవంతుడి గురించి తప్ప మరేమీ వినడానికి్కానీ మాట్లాడ్డానిక్కానీ మనసు ఒప్పదు.

ఉ. సర్వఫలప్రదాతయును, సర్వశరణ్యుఁడు, సర్వశక్తుఁడున్,
సర్వజగత్ప్రసిద్ధుఁడును, సర్వగతుం డగు చక్రపాణి యీ
సర్వశరీరులున్ విగమసంగతిఁ జెంది విశీర్యమాణులై
పర్వినచో నభంబుగతి బ్రహ్మము దాఁ జెడకుండు నెప్పుడున్. [2-210]

ప్రపంచం అంతా విలీనమైపోయినా (సర్వశరీరులున్ విగమసంగతి), చక్రపాణి మాత్రం తానొక్కడు చెక్కుచెదరకుండా ఉంటాడు. దీన్నే మహర్షులు చెప్పే సత్యం గా అర్థం చేసుకోవచ్చు. భగవంతుడు తప్ప మరేమీ లేదు ఈ ప్రపంచంలో. ఉండేది, ఉన్నది, ఉండబోయేదీ భగవంతుడు తప్ప మరోటి ఏదీ లేదు. మనం చదువుకునే సామాన్య శాస్త్రం లో కూడా ఇదే గమనించవచ్చు. శక్తి అన్నది నశింపచేయలేము. అది ఒక రూపంలోంచి మరో రూపంలోకి మారుతుంది. ఈ శక్తి ఎక్కడుంది? కంటికి కనిపించని పరమాణువునుండి కనిపించే ఈ అండపిండ బ్రహ్మాండమంతా అదే ఉన్నది. 'హరిమయము విశ్వమంతయు హరి విశ్వమయుండు... " అనేదే ఎన్ని సార్లు చెప్పినా.

ఉ. కారణకార్యహేతు వగు కంజదళాక్షునికంటె నన్యు లె
వ్వారును లేరు; తండ్రి! భగవంతు ననంతుని విశ్వభావనో
దారుని సద్గుణావళు లుదాత్తమతిం గొనియాడకుండినం
జేరవు చిత్తముల్ ప్రకృతిఁ జెందని నిర్గుణమైన బ్రహ్మమున్. [2-211]

ఈ జగంలో జరిగే కార్యా కారణాలకి భగవంతుడు తప్ప మరొకరు హేతువులు కావు. ఆయన మీద భక్తితో తప్ప మరో దారిలో మన మసులు నిర్గుణ బ్రహ్మమైన పరమాతుణ్ణి తెలుసుకోవడం అసాధ్యం.

మ. నిగమార్థప్రతిపాదకప్రకటమై; నిర్వాణ సంధాయిగా
భగవంతుండు రచింప భాగవతకల్పక్ష్మాజమై శాస్త్ర రా
జి గరిష్ఠంబగు నీ పురాణ కథ సంక్షేపంబునం జెప్పితిన్;
జగతిన్ నీవు రచింపు దాని నతివిస్తారంబుగాఁ బుత్రకా! [2-212]

ఈ భాగవతం ఎవరు రాసారు? వ్యాసుడు. ఆ వ్యాసుడు భగవంతుడి అవతారం కనక మనకోసం భగవంతుణ్ణి ఎలా తెలుసుకోవాలి అనే విషయం అర్ధమవ్వడానికే ఈ భాగవతం రాశాడు. ఈ భాగవతం వేదార్ధాలని ప్రతిపాదించడం చేత (నిగమార్థప్రతిపాదకప్రకటమై) ముక్తిని ప్రసాదించేదిగా ఉంది (నిర్వాణ సంధాయిగా). ఈ కధని బ్రహ్మదేవుణ్ణైన నీకు చెప్పాను. వెళ్ళి జగత్తులో మిగతావారికి చెప్పు.

చ. పురుషభవంబునొందుట యపూర్వము జన్మము లందు; నందు భూ
సుర కుల మందుఁ పుట్టు టతిచోద్యము; నిట్లగుటన్ మనుష్యుల
స్థిర మగు కార్య దుర్దశలచేత నశింపక విష్ణు సేవనా
పరతఁ దనర్చి నిత్యమగు భవ్యపథంబును బొందు టొప్పదే? [2-213]

మనుష్యుడిగా పుట్టడం అరుదు. అలా పుట్టాక అనేక మైన చెడు గుణాలతో నశించకుండా శ్రీహరి సేవతో తరించడం మంచిది కదా? ఈ విషయం కొంత ఆలోచిస్తే మొదట్లో ప్రాణులన్నీ నీటిలో ఉండేవి. అక్కడనుండి భూమ్మీదకి పాకి జంతువులగా, మనుషులగా వ్యాప్తి చెందాయి అని చెప్పడం వింటున్నాం. ఈ వ్యాప్తికి – అంటే ఈ జీవితం ఏమిటి, నేనెవరిని, ఈ విశ్వం అంతా ఇలా ఉండడనికి కారణం ఎవరు, ఏయే సూత్రాలకి ఆధారంగా ఈ జగత్తు నడుస్తోంది వగైరా ఆలోచనలు చేయగలిగే – మానవుడిగా పుట్టడానికి అనేక జన్మలు పడుతోంది. ఇన్ని మార్పులొచ్చాక పాత జన్మలన్నీ మర్చిపోయి – నాది, నేను, అనుకుంటూ అధోగతిలోకి వెళ్లడం కన్నా భగవంతుడికి మనసు అర్పించి ముందుకెళ్ళడం మంచిది కదా? అదే ఈ పద్యం లో చెప్పేది.

ఒక జీవికి కైవల్యం ప్రాప్తించాలంటే ఎన్ని జన్మలు పడుతుంది అనే ప్రశ్నకి పరమహంస యోగానందగారు చెప్పడం బట్టి ముప్పై నుండి అరవై లక్షలు జన్మలు పట్టవచ్చుట. అన్నీ మానవ జన్మలు కాకపోయినా ఒక లక్ష జన్మలు మానవ జన్మ అనుకుంటే మనకి భక్తి కలగడానికీ, కైవల్యం పొందడానికీ దాదాపు డబ్బై లక్షల సంవత్సవారాలు పట్టవచ్చు. అయితే అన్ని జీవులకీ ఇన్ని జన్మలు పట్టకపోవచ్చు. ఆ సమయం తగ్గించుకోవడం మనచేతుల్లో ఉన్న పనే. భగవంతుణ్ణి నిరంతరం గుర్తుపెట్టుకోవడం. గజేంద్రుడిలాగా "నీవే తప్ప నిత: పరంబెరుగ..." అంటూ మొరపెట్టుకోవడం.

మ. ఉపవాసవ్రత శౌచ శీల మఖ సంధ్యోపాస నాగ్నిక్రియా
జప దానాధ్యయ నాది కర్మముల మోక్షప్రాప్తిసేకూర; ద

చ్చపుభక్తిన్ హరిఁ బుండరీకనయనున్ సర్వాతిశాయిన్ రమా
ధిపుఁ బాపఘ్నుఁ బరేశు నచ్యుతుని నర్థిం గొల్వలేకుండినన్. [2-214]

అయితే ఈ భవంతుణ్ణి గుర్తుంచుకునే భక్తి ఎలా ఉండాలనేది కూడా చెప్తున్నాడు. నిర్మలమైన భక్తి తో కొలవలేకపోతే (అచ్చపు భక్తిన్) చేసే ఉపవాసాల వల్లా, సంధ్యోపాసనవల్లా, జపధ్యానాదుల వల్లా ఏమీ ప్రయోజనం లేదు. అటువంటి కర్మలు చేసినా వాటివల్ల మోక్షం దొరకడం అసంభవం.

క. వనజాక్షు మహిమ నిత్యము
వినుతించుచు; నొరులు వొగడ వినుచున్; మదిలో
ననుమోదించుచు నుండెడు
జనములు దన్మోహవశతఁ జనరు మునీంద్రా!" [2-215]

నిర్మల భక్తి కూడా మనకి కష్టం కనక దానికేది దారి అనేది కూడా చెప్తున్నాడు. భగవంతుడి మహిమని నిత్యం వింటూ, మనసులో మననం చేస్తూ ఉండాలి. అందుకే మనకి స్వాధ్యాయం అనేది ముఖ్యం అని చెప్తూ ఉంటారు. నిత్యం ఒకే పుస్తకం – భాగవతం లాంటిది, చదువుతూ ఉండాలి. సత్సంగంలో భగవంతుడి మహిమలు వింటూ ఉండాలి. అప్పుడు ఆ భగవంతుడిమీదే మనసు నిలుస్తుంది. ఇదే శంకరులు చెప్పేది కూడా. ఎవరేమనుకుంటారో అని చూడకుండా సత్సంగం చేస్తూనే ఉండాలి. ఇదంతా ఎందుకంటే,

సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః

సత్సంగం తో విషయవాసనలు వదిలించుకోవచ్చు. అవి పోతే మోహం వదులుతుంది. మోహం పోవడంతోనే మనసు నిర్మలమౌతుంది. జీవన్ముక్తికి – జనన మరణ చక్రంలోంచి విముక్తికి – నిర్మలమైన మనస్సే ఆధారం.

ఈ మనసు, మనలోని సంస్కారాలూ మనని జన్మ నుంచి మరో జన్మకి ఎలా ఏడిపిస్తాయో, చావు దగ్గిరపడినప్పుడేమౌతుందనేది అనేకమంది చెప్పిన విషయమే. పోయేటపుడు ఇంద్రియాలు ఒక్కొక్కటీ మనసులోకి లాగబడతాయిట. ఆఖరిగా పోయేది వినికిడి శక్తి. అందుకే మనవాళ్ళు పోయేవారి చెవిలో రామనామం చెప్తారంటారు. అలా ఒక్కొక్కటీ మనసులో విలీనం అయ్యాక శిధిలమై పోయిన శరీరాన్ని విడిచేసే ముందు ఈ జన్మలో, అంతకు ముందు జన్మలో కూడగట్టుకున్న సంస్కారాలన్నింటినీ చుట్ట చుట్టుకుని ఆత్మ మరో శరీరంలో ప్రవేశిస్తుంది అంటారు. అందుకే మంచి పనులు చేసేవాడు వచ్చే జన్మలో అక్కణ్ణుంచి మరింత కష్టపడి పైకి భగవంతుణ్ణి చేరే దారిలో మరో మెట్టు పైకి వెళ్తాడుట. అయితే ఈ నిచ్చెనలో పైకే వెళ్ళి తీరతాం అని చెప్పడానికి లేదు. మనం చేసే పనులని బట్టి పైకో కిందకో అనేది నిర్ణయించేది మనం, మనం చేసే కర్మలూ. ఇవన్నీ వదలాలంటే నిర్మలంగా మనసు భగవంతుడిమీదే ఉండాలి. దాని కోసమే ఈ సత్సంగం అనే ప్రయత్నం అంతా. నిర్మలమైన మనసుని పట్టి ఉంచడానికి బంధాలేమీ లేనప్పుడు అది భగవంతుణ్ణి చేరుకుంటుంది. అదే ముక్తి, మరో జన్మ లేకపోవడం. బుద్ధుడు చెప్పే భగరోగ నివారణ ఇదే. మరో జన్మ లేకుండా వదిలించుకోవడం.

అయితే సత్సంగం అవీ లేకుండా అజామీళుడు, కన్నప్ప అనేవారు భగవంతుణ్ణి చేరుకున్నారు కదా, అలా మనమూ చేరుకోలేమా? తప్పకుండా చేరుకోగలం. ఒకటే ఇబ్బంది. పోయే ముందు మన మనసులోకి భగవంతుడు గుర్తొస్తాడా? అలా గుర్తు రావాలంటే ప్రతీరోజూ భగవన్నాం అభ్యాసం చేయాలి కదా? జీవితంలో రోజూ భగవంతుడు ఎప్పుడూ గుర్తు రానప్పుడు పోయేటపుడు మాత్రం ఎందుకు గుర్తొస్తాడు? ఎన్నో జన్మల అదృష్టం ఉంటే కానీ అలా జరగదు కనక ఈ దారి అందరికీ కుదరకపోవచ్చు. అందుకే సత్సంగం చేయమని చెప్పేది. జీవితం అంతా అభ్యాసం చేస్తే చివర్లో భగవంతుడు గుర్తు రావచ్చు. ఇదే విషయం మన కంచర్ల గోపన్న కూడా చెప్తున్నాడు చూడండి.

ఉ. ముప్పున గాలకింకరులు ముంగిట నిల్చినవేళ, రోగముల్
గొప్పరమైనచో గఫము కుత్తుకనిండినవేళ, బాంధవుల్
గప్పినవేళ మీ స్మరణ గల్గునో గల్గదో, నాటి కిప్పుడే
తప్పక చేతు మీ భజన దాశరధీ కరుణాపయోనిధీ

చావు వచ్చేటప్పుడు కాలకింకరులు – యముడి భటులు వచ్చి గుమ్మంలో నించున్నారు. నేను రాను, ఇంకా కొంచెం సమయం కావాలి అని అడగడం కుదరదు. రోగముల్ గొప్పరమైనచో – విపరీతమైన వ్యాధితో శరీరం కుళ్ళి

పోయింది. ఆ వ్యాధుల వల్ల గొంతుకలో కఫం నిల్చిపోయి మాట రావడంలేదు. మనసంతా వ్యాకులం చచ్చిపోతానేమో అని. అప్పుడైనా భగవంతుడి రూపు గుర్తు తెచ్చుకుందామంటే చుట్టూరా బంధువులు – బాంధవుల్ కప్పినవేళ – తమ మొహం చూపించడానికి వాళ్ళకి తహ తహ, పోయేవాడికి చివరి చూపు ఎవర్ని చూద్దామా అనే. అప్పుడు నీ స్మరణ కలుగుతుందో లేదో? భగవంతుడా ఇప్పుడే, బలసత్వాలు ఉన్నప్పుడు నీ భజన చేస్తాను అంటున్నాడు.

క. అని వాణీశుఁడు నారద
మునివరునకుఁ జెప్పినట్టి ముఖ్యకథా సూ
చన మతిభక్తిఁ బరీక్షి
జ్జనపాలునితోడ యోగిచంద్రుఁడు నుడివెన్. [2-216]

ఇలా బ్రహ్మ (వాణీశుడు, సరస్వతి భర్త) నారదుడితో భాగవతం గురించి చెప్పాడు అంటూ శుక మహర్షి, ఆ భాగవతం కథ చెప్పాడని పరీక్షిత్తుతో చెప్తున్నాడు. పోతన ఈ పద్యంలో శుకమహర్షిని ఏమన్నాడో గమనించారా? యోగిచంద్రుడు – యోగుల్లో చంద్రుడంతటివాడు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS